క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సెక్షన్‌లోని 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ రూరల్ ఫీడర్‌పై బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌పై ఆర్డీఎస్ పనుల నిమిత్తం ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

నూతన వంగడాలకు శ్రీకారం


జీడితోటను పరిశీలిస్తున్న డీహెచ్‌వో సిబ్బంది

గోపాలపురం: జీడిమామిడి సాగులో నూతన వంగడాలకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి కె. మల్లిఖార్జునరావు అన్నారు. గోపాలపురంలో జీడిమామిడి ఉత్తమ రైతు ముప్పన రమణారెడ్డి జీడితోటను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన వంగడాలవైపు రైతులను మొగ్గు చూపే విధంగా నూతన వంగడాలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. నూతనవంగడాల వల్ల అధిక దిగుబడులతో పాటు పెట్టుబడి తక్కువ అవుతుందని ఉద్యాన పంటలకు రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, మొక్కల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట రైతు రమణారెడ్డి, మండల ఉద్యానవనశాఖ అధికారి జి.రమేష్‌బాబు, హెచ్‌ఈవోపి వివేక్ ఉన్నారు.

12న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

నిడదవోలు రూరల్: పిల్లల్లో నులి పురుగుల నివారణ కోసం ఈనెల 12న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు వస్తాయని ఆయన చెప్పారు. అనంతరం నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, మలకపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాలు వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురం, బల్లిపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేగేశ్వరపురం సర్పంచ్ కొమిక్క రెడ్డి పరశురామారావు, మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.అన్నపూర్ణ, సూపర్ వైజర్ భానుమతి, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

నిడదవోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు (వాట్సాప్ గవర్నెన్స్)పై మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించెందుకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో వాట్సాప్ గవర్నెన్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని 200 పైగా ఉన్న ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మునిసిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: పేద వర్గాల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని లాంటిదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం 42 మంది లబ్దిదారులకు రూ. 23.51లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రూ.7 లక్షల విలువైన ఎల్ వోసీ సిఫారసు లెటర్‌ను మంత్రి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 12 నెలలలో 235 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్, ఎల్ వోసీల ద్వారా రూ.2,14,74,593 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. ఆరోగ్యం విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తమకు దరఖాస్తులు అందిస్తే ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు సూచించారు.

పనుల్లో కదలికొచ్చేనా..?

- సౌకర్యాల కొరతతో క్రీడాకారుల అసంతృప్తి
- చిట్టడవిని తలపిస్తున్న క్రీడా మైదానాలు
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు


జెడ్పీ హైస్కూల్ మైదానంలో క్రీడాకారుల సందడి


2016లో వికాస కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

దేవరపల్లి: క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు క్రీడా నైపుణ్యం పెంపొందించడానికి అన్ని వసతులతో కూడిన క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలకు 2015–16లో అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని తొలుత 75 నియోజకవర్గాల్లో వికాస కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో వికాస కేంద్రాలను మంజూరు చేసి ఒక్కొక్క కేంద్రానికి రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. గోపాలపురం నియోజకవర్గానికి సంబంధించి దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలును ఎంపిక చేసింది. 2014–15లో రవీంద్రనాథ్ శాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి క్రీడా వికాస కేంద్రం మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలకు కృషి చేశారు. అదే సంవత్సరం నవంబరు 6న అప్పటి క్రీడల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని ప్రకటించారు. అప్పట్లో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు సకాలంలో నిలిచిపోయాయి.

అన్ని సదుపాయాలతో ఏర్పాటు

క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో క్రీడా వికాస కేంద్రంలో ఏర్పాటు చేయవలసి ఉంది. వికాస కేంద్రానికి కోచ్‌ని నియమించి ప్రతి రోజు క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు. క్రీడా ప్రాంగణంలో అన్నిరకాల క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తారు. శారీరక దృఢత్వానికి జిమ్ము, బాలికలు, బాలురు దుస్తులు మార్చుకునే గదులు, రెండు వుడెన్, షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీ


దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా క్రీడా కేంద్రం

బాల్ కోర్టులు ఏర్పాటు చేయవలసి ఉంది. మైదానాన్ని లెవెలింగ్ చేసి 50 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం కల్పించవలసి ఉంది. నియోజకవర్గస్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహిస్తారు.

దేవరపల్లికి గుర్తింపు

క్రీడా పటంలో దేవరపల్లికి గుర్తింపు లభించిందనడంలో అతిశయోక్తి లేదు. 1994 ఆగస్టు 9న పేరం రవీంద్రనాథ్ టి.నర్సాపురం జెడ్పీ హైస్కూలు నుంచి బదిలీపై దేవరపల్లి హైస్కూలుకు వచ్చారు. అప్పటి వరకు క్రీడలంటే తెలియని ఈ ప్రాంత విద్యార్థులకు వాటి పట్ల అవగాహన కల్పించారు. పలు రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ముళ్లపొదల్లో ఉన్న క్రీడా మైదాన్ని శుభ్రం చేసి క్రీడా కోర్టులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర క్రీడా పోటీలు దేవరపల్లి క్రీడా మైదానంలో నిర్వహించే స్థాయికి హైస్కూలు ఎదిగింది. దాదాపు 22 ఏళ్ల రవీంద్రనాథ్ ఇక్కడ పీడీగా పనిచేసి వందలాది మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేశారు. ఇక్కడ వికాస కేంద్రం నిర్మాణం పూర్తయితే ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగం



నియోజకవర్గంలో ప్రతి పాఠశాలలో జిల్లా, రాష్ట్ర, జాతీయ క్రీడాకారులు ఉన్నారు. టోర్నమెంట్లు దేవరపల్లిలో చేపట్టిన క్రీడా వికాస కేంద్రం నిర్మాణం తొమ్మిదేళ్లుగా అసంపూర్తిగా ఉంది. ఇప్పటికైనా వికాస కేంద్రాన్ని పూర్తి చేస్తే క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కాకోలు రాజేష్, ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు, దేవరపల్లి

నిర్మాణాలకు ప్రభుత్వం సుముఖత



అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఈ ఏడాది క్రీడా వికాస కేంద్ర నిర్మాణం పూర్తి చేసి ఇద్దరు కోచ్‌లతో నిరంతరం ఇక్కడ క్రీడాకారులకు శిక్షణ ఇస్తారు.

– పేరం రవీంద్రనాథ్, శాప్ డైరెక్టర్, హెచ్ఎం, జెడ్పీ హైస్కూలు, రామన్నపాలెం

పశువైద్యశాల భవన నిర్మాణానికి చర్యలు

సాక్షి ఇంపాక్ట్

చాగల్లు: చాగల్లులో పశువైద్యశాల నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సాక్షిలో ఈనెల 4న 'పట్టని మూగ రోదన' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి పశుసంవర్ధకశాఖాధికారులు స్పందించారు. చాగల్లు మండలంలోని కలవలపల్లి, చాగల్లులో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఉద్యోగుల నియమకాలని చేపట్టాడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులంతా పశుసంవర్ధక సహాయకుల సేవలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలో వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడుని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం మలకపల్లిలోని హిజ్రా వైశాలిని దుద్దుకూరుకు చెందిన చాపల మురళి వివాహం చేసుకుని నివాసం ఉంటున్నారు. వీరి ఇంటి వెనుక సిర్రా దేవదాసు అనే వ్యక్తితో కలిసి మురళి రాడ్‌బెండిగ్ పనికి వెళుతున్నట్టు తెలిపారు. గతంలో వీరి మధ్య చిన్నపాటి గొడవ జరిగిన్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదిన మురళి ఇంటి వద్ద వినాయక చవితి సందర్భంగా బుట్ట బొమ్మలు తయారు చేసుకుంటున్న సమయంలో దేవదాస్ వెనుక వైపు నుంచి వచ్చి కత్తితో మెడ, నడుంపై దాడి చేసి హత్యాయత్నానికి పాలనడినట్టు వివరించారు. దింతో స్థానిక పీహెచ్‌సీకి అనంతరం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి, ప్రస్తుతం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్సై తెలిపారు. వైశాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యా యత్నం కేసు నమోదు చేసి ముద్దాయి సిర్రా దేవదాస్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. గతంలో ఇతని పై 2009లో హత్య కేసు ఉందని, రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న రామకృష్ణ, ప్రకృతి సిబ్బంది


వరిచేనుపై కషాయాలను పిచికారీ చేస్తున్న డ్రోన్

పెరవలి: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న పరిధిలోని వరిపంటపై ఆశించే తెగుళ్లను అరికట్టడానికి డ్రోన్ సహాయంతో కషాయాలను పిచికారీ చేయుస్తున్నామని జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రోజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఉసులుమర్రులో వరి చేలపై కషాయాలను డ్రోన్‌తో పిచికారీ అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని 45 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించామని అందులో భాగంగా డ్రోన్‌ల సహాయంతో పిచికారీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇందుకోసం 30 డ్రోన్‌లను వినియోగిస్తామని ఎకరానికి మందులు పిచికారీ చేసినందుకు రూ.300లు, కషాయాలకు రూ.200 చొప్పున ఎకరానికి రూ.500 లు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి మండలంలో 250 ఎకరాల్లో 6 డ్రోన్‌లతో ప్రకృతి వ్యవసాయం చేసే చేలకు ఈ డ్రోన్లతో కషాయాలను పిచికారీ చేయటానికి ప్రణాళిక రూపొందించామని వివరించారు. దీని వలన రైతులకు ఖర్చు తగ్గటంతో పాటు ప్రతి వరిదుబ్బుపై మందు పిచికారీ జరిగి మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి మహాలక్ష్మి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను విరమించుకోవాలి


దేవరపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

దేవరపల్లి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం విరమించుకుని, సర్దుబాటు చార్జీలను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో దేవరపల్లి సబ్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు తగ్గవని, ప్రజలపై అదనపు భారం పడుతుందని ఆయన తెలిపారు. అదాని కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తుందన్నారు. ఇప్పటికే సర్దుబాటు చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నాలను అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆందోళన అనంతరం ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రత్నాజీ, అయినపర్తి శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు పోలుమాటి పెంటయ్య, అడపా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలి

నిడదవోలు: స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జిలు, ఇంధన సర్దుబాటు చార్జీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం నిడదవోలు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగింపు ద్వారా ప్రజల జేబులు కొల్లగొట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇప్పటికే ట్రూ అఫ్ చార్జిలు, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో అధిక కరెంటు బిల్లులు చెల్లించలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లిడి రామిరెడ్డి, మోర్త పోసియ్య, పి.మోహన్ సారధి, గాలి గనిరాజు తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలి


ఏపీ జీఈఏ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌వర్మ

గోపాలపురం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఉద్యోగి నడుంబిగించాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం గోపాలపురం తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ)శాఖ ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమీషన్ నియమించి, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, రూ.30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దుచేసి ఏపీఎస్ అమలు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతి ఛానల్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తామని, ఏ ఉద్యోగికి అన్యాయం జరిగినా వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం కార్యదర్శి కె.రాజు, డిప్యూటి తహసీల్దార్ పీవీ శాంబశివరావు, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఎలక్షన్ డీటీ కె.నల్లరాజు ఏపీ జీఈఏ గోపాలపురం శాఖ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త బదిలీ

- అంగన్‌వాడీపై సీడీపీఓ విచారణ
- మరో కేంద్రానికి బదిలీ


అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీఓకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

దేవరపల్లి: నల్లజర్ల మండలం పోతవరంలోని 43వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తపై పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తమ చిన్నారి బుగ్గపై కార్యకర్త ప్రభ గట్టిగా గిల్లడంతో బుగ్గ వాచిందని తల్లిదండ్రులు మంగళవారం సీడీపీఓ డి.మమ్మీకి ఫిర్యాదు చేశారు. చిన్నారి తల్లిదండ్రులు రాజు, ఝాన్సీ, పిల్లల తల్లిదండ్రులు పలువురు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కటారు జోషిక సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకొంటుంది. శనివారం సాయంత్రం కేంద్రం నుంచి ఇంటికి వెళ్లిన చిన్నారి బుగ్గపై ఉన్న గాయాన్ని చూసి అడగగా టీచర్ కొట్టిందని, మీరు అడిగితే రేపు స్కూల్లో మరలా కొడుతుందని చిన్నారి భయపడినట్లు తెలిపింది. అనంతరం మంగళవారం తండ్రి రాజు విషయం తెలుసుకోవడానికి చిన్నారిని వెంట బెట్టుకుని కేంద్రం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కార్యకర్త ప్రభ కేంద్రంలో లేకపోవడంతో సీడీపీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీడీపీఓ కేంద్రానికి చేరుకుని విచారణ నిర్వహించారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సమక్షంలో జరిగిన సంఘటనపై వివరాలను తెలుసుకుని నమోదు చేశారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు రాజు, ఝాన్సీ మాట్లాడుతూ ప్రభ కేంద్రంలో ఎందుకు కేంద్రంలో ఉండడంలేదని ప్రశ్నిస్తే వేరు మీటింగ్‌లకు వెళ్లవలసి వస్తోందని, పిల్లలంతా కేంద్రంలో ఆడుకొంటున్న సమయంలో పొరపాటున ఏదైనా తగిలి గాయపడి ఉంటుందని ప్రభ బదులిచ్చారు. ఇరువురి వాదనలు విన్న సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారి బుగ్గపై ఎటువంటి గాయంలేదని చెప్పారు. కార్యకర్త ప్రభపై గ్రామస్తులు అనేక ఆరోపణలు చేస్తున్నందున తాత్కాలికంగా 43వ కేంద్రం నుంచి 41వ కేంద్రానికి మార్పినట్టు వెల్లడించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం దృశ్యాలు

దేవరపల్లి: శ్రావణ మాసం సందర్భంగా దేవరపల్లిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకను మంగళవారం రాత్రి ఆలయం వద్ద వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి భక్తుల గోవింద నామ స్మరణలో అర్చకులు అగ్నిహోత్రం దుర్గాప్రసాద్ ఆచార్యులు, కేశవాచార్యులు వివాహ వేదికపైకి తోలుకొని వచ్చారు. రాత్రి 7.30 గంటల నుంచి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, కల్యాణ అక్షింతలు అందజేశారు. పట్టెం కావీవిశ్వనాథం, అనురాధ, గేలం సత్యనారాయణ పద్మావతి, గేలం వీరభద్రరావు సూర్యకుమారి, మేడ్ని సతీష్, రమాదేవి దంపతులు స్వామి వారి కల్యాణం సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు, స్వామి వారికి పట్టువస్త్రాలు, కల్యాణ తలంబ్రాలు భక్తులు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు తీగెల బలరామయ్య, గుడ్ల వెంకటేశ్వరరావు, గేలం వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

'విద్యార్థి వికాసం' పుస్తకావిష్కరణ

కంబాలచెరువు: గాడాల మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రైమరీ నెంబర్ వన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సురేష్ కుమార్ రచించిన విద్యార్థి వికాసం అనే పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థి బాల్య దశ నుంచి కౌమారం వరకు వారి ఆలోచనలు ఏ విధంగా ఉంటాయో అనేక ఉదాహరణలతో రచించిన సురేష్ కుమార్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులపై, వారి భవిష్యత్తుపై ఉపాధ్యాయులు పాజిటివ్ దృక్పథంతో ఉండాలన్నారు. పుస్తకం ఎడిటర్‌గా ఉన్న డాక్టర్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ సురేష్ కుమార్ అనుభవాలు, సమాజ పరిస్థితులు, విద్యార్థులు తల్లిదండ్రుల స్థితిగతులను చాలా చక్కగా రాశారన్నారు.

దస్తావేజు పోయినది

పెనుపోతుల వెంకటేశ్వరరావు S/o కదలయ్య అను నేను తూ.గో.జిల్లా, దేవరపల్లి మండలం, బంధపురం గ్రామ కాపురస్తుడ్ని. నా రిజిష్టర్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం.1942/2008 ను పుచ్చుకొని దేవరపల్లిలో జిరాక్స్ తీయించుటకు తీసుకువెళ్ళగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు దయతో ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

97019 63000

కూలితే గాని కదలరా..?


వాదాలకుంట రహదారిలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టు

గోపాలపురం: గోపాలపురం నుంచి వాదాలకుంట వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎండిపోయి ప్రమాదభరితంగా ఉన్న భారీ చెట్టును తొలగించాలని వాహనదారులు వేడుకుంటున్నారు. గత వారం రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు ఏ క్షణాంలో చెట్టు విరిగి పడితో ప్రమాదం చోటు చేసుకుంటుందని అండ్‌బీ, పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే ఎండిపోయిన చెట్టును తొలగించాలని వాదాలకుంట ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

క్రమబద్ధీకరణ దరఖాస్తులకు గడువు పెంపు

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)ను జీవో 134 ద్వారా అవకాశం కల్పించిందని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో 2025 జూన్ 30 కన్నా ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. దీని ద్వారా ప్రజలకు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రం సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందుటకు వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకుని అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అనధికార స్థలాలు, ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు ప్రభుత్వ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ చేయని అనధికార లేఅవుట్ల ప్లాట్లకు రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ తరహా ప్లాట్లకు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వవని, ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కూడా మంజూరయ్యే అవకాశం ఉండదన్నారు. పూర్తి వివరాల కోసం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలను సంప్రదించాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com